ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
ఆదివారం 24 మార్చి 2024



చెక్ పోస్టుల వద్ద పక్కాగా తనిఖీలు

ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలి

- కోడ్ అమలులో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు
- పోలీసు అధికారుల సమీక్షలో ఎస్పీ కేవీ మురళీకృష్ణ

- వార్త 7వ పేజీలో..

ఎయిడెడ్

వైసీపీ హయాంలో పదుల సంఖ్యలో ఎయిడెడ్ విద్యా సంస్థలు మూత

- ఆస్తులతో సహా అప్పగించండి లేదంటే సిబ్బందిని సరండర్ చేయండి... సాయం మాత్రం చేయలేమంటూ చేతులెత్తేసిన సర్కారు
- గత్యంతరం లేక మూసివేసిన యాజమాన్యాలు
- సొంతంగా నడుపుతున్న మరికొంతమంది...
- పెరిగిన ఫీజుల భారం
- ఉమ్మడి జిల్లాలో పది వేల మంది విద్యార్థులపై ప్రభావం
- వచ్చే ఏడాది మరికొన్ని స్కూళ్లు ఎత్తివేతకు నిర్ణయం



విశాఖలోని సెయింట్ ఆంథోనీ ప్రాథమికోన్నత పాఠశాల

విశాఖపట్నం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ కాలం నుంచి నడుస్తున్న ఎయిడెడ్ సంస్థలకు రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఘోరీ కట్టింది. ఎయిడెడ్ సంస్థలకు చెందిన ఆస్తులపై కన్నేసిన ప్రభుత్వం వ్యూహాత్మకంగా వాటిని స్వాధీనం చేసుకునేందుకు యత్నిం చింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద నడిచే ఎయిడెడ్ కళాశాలలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 80 నుంచి 90 శాతం వరకూ మూతపడ్డాయి. ఆ ప్రభావం వేలాది మంది విద్యా ర్థులపై పడింది. ఎయిడెడ్ విద్యా సంస్థలు మూతపడడంతో స్థోమత ఉన్నవారు ప్రైవేటు పాఠశాలలు/కళాశాలల్లో, లేనివారు సమీపంలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేరారు. కొంతమంది మాత్రం చదువులకు దూరమయ్యారు.

వైసీపీ ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చిన తరువాత ఎయిడెడ్ విద్యా సంస్థలను వదిలించుకునే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. దీనికోసం మూడు రకాల ప్రతిపాదనలను యాజమాన్యాల ముందుంచింది. దీంట్లో మొదటిది...ఎయిడెడ్ సంస్థలను ఆస్తులు, సిబ్బందితో సహా ప్రభుత్వానికి అప్పగించడం, రెండు...ఆస్తులను సంబంధిత యాజమాన్యాల పరిధిలో ఉంచుకున్నా ప్రభుత్వం ఇచ్చే జీతాలతో పనిచేసే అధ్యాపక/ఉపాధ్యాయ/ఉపాధ్యాయేతర సిబ్బందిని వెనక్కి అప్పగించడం, మూడు...ప్రభుత్వం నుంచి సాయం ఆశించకుండా యాజమాన్యాలే సొంతంగా నడుపుకోవడం. ప్రభుత్వంతో గొడవ ఎందుకని జిల్లాలో తొలుత కళాశాలల యాజమాన్యాలు తమ వద్ద పనిచేసే అధ్యాపకులు, సిబ్బందిని ప్రభుత్వానికి సరండర్ చేశారు. ఏవీఎన్, బీవీకే, బుల్లయ్య కళాశాలల యాజమాన్యాలు తమ వద్ద పనిచేసే అధ్యాపకులను, సిబ్బందిని వెనక్కి పంపే శాయి. ప్రస్తుతం సొంతంగా కళాశాల నిర్వహిస్తున్నాయి. ప్రభుత్వం నుంచి ఎయిడ్ (సహాయం) రాకపోవడం వల్ల విద్యార్థులు గతం కంటే ఎక్కువ ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ మూడు కళాశాలల్లో సుమారు నాలుగు వేల మందికిపైగా విద్యార్థులు ఉన్నారు. వీరిలో బీసీ/ఎస్సీ/ఎస్టీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుందని ప్రభుత్వం చెబుతున్నా...చాలామందికి జమ కాలేదు. నా బీసీ...నా ఎస్సీ...నా ఎస్టీ...నా మైనారిటీ...అని తరచుగా సీఎం దీర్ఘాలు తీస్తుంటారు. అయితే ఎయిడెడ్ విద్యా సంస్థలు మూతపడడం వల్ల ప్రధానంగా ఆయా వర్గాలపై తీవ్ర ప్రభావం పడింది. ఏవీఎన్ కళాశాల యాజమాన్యం ప్రభుత్వ ఎయిడ్‌ను కాదని సొంతంగా నడుపుతోంది. ప్రభుత్వ ఉత్తర్వులను లెక్క చేయకుండా సెయింట్ జోసెఫ్, అనకాపల్లిలో ఎంఏఎల్ కళాశాల యాజమాన్యాలు మాత్రం ప్రభుత్వ ఎయిడ్‌తో బోధన కొనసాగిస్తున్నారు.

దశాబ్దాల చరిత్ర గల పాఠశాలలు మూసివేత

ఉమ్మడి జిల్లాలో దశాబ్దాల చరిత్ర ఉన్న ఎయిడెడ్ పాఠశాలలు మూతపడ్డాయి. ఈ జాబితాలో దక్షిణ భారతదేశంలో ... మిగతా 7వ పేజీలో

వ్యాన్ బోల్తా

- ఇద్దరు కూలీలు మృతి



జాతీయ రహదారిపై బోల్తా పడిన వ్యాన్



ఆదిరెడ్డి గంగునాయుడు (ఫైల్)



పూడి గంగునాయుడు (ఫైల్)

కొత్తూరు/దేవరాపల్లి, మార్చి 23: స్టీరింగ్ రాడ్డు విరిగి వ్యాన్ బోల్తా పడిన సంఘటన శనివారం అనకాపల్లి మండలం శంకరం వద్ద చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు కూలీలు మృతి చెందారు. దీనికి సంబంధించి అనకాపల్లి రూరల్ ఎస్‌ఐ తేజేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. నక్కపల్లిలో కాంట్రాక్టు పనులు చేసేందుకు నలుగురు కూలీలు పెందుర్తి నుంచి ఫ్లోరింగ్ టైల్స్ లోడుతో వ్యాన్‌లో బయలుదేరారు. అనకాపల్లి మండలం శంకరం ఆంజనేయ స్వామి ఆలయం వద్దకు వచ్చేసరికి వ్యాన్ స్టీరింగ్ రాడ్డు విరిగిపోయి పక్కనే ఉన్న డివైడర్ పైకి దూసుకువెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వ్యానులో ప్రయాణిస్తున్న నలుగురు కూలీలలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు దేవరాపల్లి మండలం కాశీపురం గ్రామానికి చెందిన ఆదిరెడ్డి గంగునాయుడు(65), పూడి గంగునాయుడు (70)గా పోలీసులు గుర్తించారు. అదే గ్రామానికి చెందిన కామిరెడ్డి ముత్యాలనాయుడు, గొర్లి అప్పారావులకు స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్‌టీఆర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

పెళ్లి ఇంట విషాదం

ఈ ప్రమాదంలో మృతి చెందిన పూడి గంగునాయుడు కుమారుడు జోగినాయుడు వివాహం వచ్చే నెల 13న జరగనుంది. ఇప్పటికే పెళ్లి పనులు ప్రారంభించారు. అయితే గంగునాయుడు మరణ వార్త తెలిసి ఆ కుటుంబ శోకసంద్రంలో మునిగిపోయింది.

సమగ్ర భూ సర్వేకు బ్రేక్

ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో పనులు నిలిపివేత

- గతంలో సర్వే చేసిన కొన్ని గ్రామాల్లో రైతుల నుంచి అభ్యంతరాలు
- పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపణలు
- వృథాగా పడి ఉన్న సర్వే రాళ్లు



అనకాపల్లి మండలం గొలగాం గ్రామంలో వృథాగా ఉన్న సర్వే రాళ్లు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి) జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన భూరక్ష పథకం సమగ్ర రీసర్వే పనులు నిలిచిపోయాయి. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో ఈ పనులకు బ్రేక్ పడింది. ఇప్పటికే ఈ సర్వే పూర్తయిన గ్రామాల్లో రైతుల నుంచి అభ్యంతరాలు వచ్చినా అధికారులు పరిష్కరించలేదని తెలిసింది. సర్వే చేసిన భూముల్లో పాతాల్సిన రాళ్లు కూడా వృథాగా పడి ఉన్నాయి.

జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా జిల్లాలోని 24 మండలాల్లో 733 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే చేస్తున్నట్టు అధికారులు గతంలో ప్రకటించారు. ఇప్పటికే రెండు విడతలుగా 368 గ్రామాల్లో భూరీసర్వే పనులు చేపట్టిన జిల్లా అధికారులు ఆయా గ్రామాల రైతులకు, భూ యజమానులకు ఇప్పటికీ పూర్తిస్థాయిలో శాశ్వత హక్కుపత్రాలు అందజేయలేకపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి. తొలిదశ కింద చేపట్టిన పనుల్లో భాగంగా జిల్లాలో 143 గ్రామాల్లో సమగ్ర రీసర్వే పూర్తి చేసినట్టు అధికారులు ఏడాది కిందటే ప్రకటించారు. తొలిదశ కింద చేపట్టిన రీసర్వే ద్వారా 2,36,040 ఎకరాల విస్తీర్ణం కలిగిన భూములకు సర్వే జరిపించారు. అయితే సర్వే జరిగిన పలు గ్రామాల్లో రకరకాల అభ్యంతరాలు, సాంకేతిక ఇబ్బందుల నేపథ్యంలో ఇంకా అందరికీ భూహక్కు పత్రాలను అందజేయలేదని తెలిసింది. మొదటి దశ కింద సర్వే పనులు పూర్తి కాకుండానే గతేడాది రెండో విడత కింద జిల్లాలో మరో 220 గ్రామాల్లో రీసర్వే చేసేందుకు పనులు ప్రారంభించారు. తొలి విడతలో మిగిలిపోయిన గ్రామాలు, రెండో విడతలో ప్రారంభించిన గ్రామాల్లో 2023 సంవత్సరం చివరి నాటికి పూర్తి చేయాలని అనుకున్నా పనులు ముందుకు సాగలేదు. అనకాపల్లి, కశింకోట, నర్సీపట్నం, చోడవరం, ఎలమంచిలి, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో అధిక సంఖ్యలో రీసర్వేపై అభ్యంతరాలు వ్యక్తమైనట్టు తెలిసింది. రైతుల ఆధీనంలో ఉన్న భూములకు సర్వే తరువాత భూముల విస్తీర్ణం తగ్గిపోవడంతో చాలా చోట్ల రైతులు భూముల రీసర్వేపై అభ్యంతరం వ్యక్తం చేశారు. సర్వేపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న రైతులు సవరణ కోసం దరఖాస్తులు చేసుకున్నా అవి సకాలంలో పరిష్కరించడం లేదని భూయజమానులు ఆరోపిస్తున్నారు.

సర్వే రాళ్లు తెచ్చి వదిలేశారు

జిల్లాలో పలు మండలాల్లో సర్వే పూర్తయిన గ్రామాల్లో భూములకు సంబంధించిన హద్దులు గుర్తించేందుకు వీలుగా సర్వే రాళ్లు తరలించి వాటిని పాతకూడానే వృథాగా వదిలేశారు. సర్వే పనులు పూర్తికాకుండానే అమరావతిలో ఒక కాంట్రాక్టరు ద్వారా కొనుగోలు చేసిన సర్వే రాళ్లను గ్రామాలకు తరలించినట్టు తెలిసింది. చాలా గ్రామాల్లో ఈ రాళ్లు వృథాగా ఉన్నాయి.

కోడ్ ఉల్లంఘించిన పూజారి సస్పెన్షన్

కృష్ణాదేవిపేట, మార్చి 23: ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన గొలుగొండ మండలం లింగంపేట నూకాలమ్మ ఆలయ పూజారిని సస్పెండ్ చేశారు. శుక్రవారం ఏఎల్‌పురంలో జరిగిన వైసీపీ సభలో ఆలయ పూజారి గోలకొండ త్రిమూర్తులు పాల్గొన్న సంగతి తెలిసిందే. దీంతో అధికారులు దర్యాప్తు చేసి పూజారి త్రిమూర్తులకు దేవదాయశాఖ ఈవో ఎస్.గంగారావు ద్వారా శనివారం సస్పెన్షన్ ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా ఈవో గంగారావు మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలను దేవదాయ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు, పూజారులు పాటించాలని, ఫిర్యాదులు వస్తే తక్షణమే చర్యలు తప్పవని హెచ్చరించారు.



విజయవాడ వర్క్‌షాపునకు టీడీపీ నేతలు

రానున్న ఎన్నికలకు అభ్యర్థులు, ఇన్‌చార్జులు, పరిశీలకులను సన్నద్ధం చేసే కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం శనివారం విజయవాడలో వర్క్‌షాపు నిర్వహించింది. వర్క్‌షాపునకు ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన అభ్యర్థులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, పల్లాశ్రీనివాసరావు, వంగలపూడి అనిత, ఎం.శ్రీభరత్, వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, కేఎస్‌ఎన్‌ఎస్. రాజు, పైలా ప్రసాద్, దొన్నుదొర, కోళ్ల లలితకుమారి హాజరయ్యారు. ఇంకా పార్టీ నేతలు బుద్దా నాగజగదీశ్వరరావు, గండి బాబ్జీ, ప్రగడ నాగేశ్వరరావు, పీలా గోవింద సత్యనారాయణ, చోడే పట్టాభి, పుచ్చా విజయకుమార్, బొండా జగన్ తదితరులు పాల్గొన్నారు.

- విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి

నేటి నుంచి ఐపీఎల్ మ్యాచ్‌ల టికెట్ల అమ్మకం



ఢిల్లీ క్యాపిటల్స్-కోల్‌కతా నైట్‌రైడర్స్ మ్యాచ్‌కు నేటి నుంచి ఆన్‌లైన్‌లో విక్రయం

- ఢిల్లీ క్యాపిటల్స్-చెన్నై సూపర్‌కింగ్స్ మ్యాచ్‌కు ఈనెల 27 నుంచి...
- టికెట్ల ధరలు: రూ.1,000, 1,500, 2,000, 3,000, 3,500, 5,000, 7,500

.7లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (ఆది)	6.12
సహరి (సోమ)	4.44

టెన్త్ పరీక్షా కేంద్రం వద్ద హల్‌చల్

- 'ఆంధ్రజ్యోతి' కంటపడిన వైనం
- పరీక్ష ప్రారంభమైన వెంటనే ప్రశ్నాపత్రం బయటకు వెళుతున్నట్టు సమాచారం
- అటువంటిదేమి లేదన్న పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్

ధర్మవరం అగ్రహారం హైస్కూల్ గోడ దూకి స్లిప్పు ఇచ్చి వచ్చిన యువకుడు



ధర్మవరం అగ్రహారం పరీక్షా కేంద్రం ప్రహరీ గోడ దూకి స్లిప్పుతో వెళుతున్న యువకుడు



స్లిప్పు ఇచ్చేసి ప్రహరీ గోడ దూకి బయటకు వెళ్లిపోతున్న దృశ్యం

ఎస్.రాయవరం, మార్చి 23: మండలంలోని ధర్మవరం అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు కొంతమంది యువకులు యథేచ్ఛగా స్లిప్పులను సరఫరా చేస్తున్నారు. శనివారం ఓ యువకుడు ఈ పరీక్షా కేంద్రం ప్రహరీ గోడ దూకి ఫిజికల్ సైన్స్ పరీక్ష రాస్తున్న విద్యార్థులకు స్లిప్పు అందించి దర్జాగా బయటకు రావడం 'ఆంధ్రజ్యోతి' కంటపడింది. ఇక్కడ పరీక్ష ప్రారంభమైన కొద్ది సేపటికే ప్రశ్నాపత్రం బయటకు వస్తున్నట్టు తెలిసింది. దీంతో పరీక్ష ప్రారంభమైన కొంతసేపటికే ఇక్కడ పలువురు యువకులు హల్‌చల్ చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ఓ యువకుడు సమీపంలో పోలీసు సిబ్బంది ఉన్నప్పటికీ వాళ్ల కళ్లుగప్పి స్లిప్పు పట్టుకొని పరీక్షా కేంద్రం వెనుక వైపు ఉన్న ప్రహరీ గోడ దూకి లోపలికి ప్రవేశించాడు. విద్యార్థులకు స్లిప్పు ఇచ్చేసి మళ్లీ గోడ దూకి బయటకు వెళ్లిపోయాడు. ఈ పరీక్షా కేంద్రం వద్ద ఇద్దరు పోలీసులు, ఇద్దరు సచివాలయ మహిళా పోలీసులు ఉన్నారు. పరీక్షా కేంద్రం వద్ద గుంపులుగా ఉన్న యువకులను అక్కడ నుంచి పంపించేయడంతో పాటు అనుమానాస్పదంగా ఉన్న వారిని పట్టుకునే ప్రయత్నం చేశారు. ఇక్కడి పరిస్థితిపై పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు వివరణ కోరగా స్లిప్పులతో ఎవరూ పరీక్షా కేంద్రం లోనికి రాలేదని చెప్పారు. పరీక్ష గదుల్లోకి స్లిప్పులు రాకుండా చూస్తున్నామన్నారు. అయితే పరీక్షా కేంద్రం వెనుక ప్రహరీ గోడ చిన్నదిగా ఉండడంతో ఓ యువకుడు దూకి లోపలికి రావడంతో పోలీసులు హెచ్చరించి పంపేశారని చెప్పారు. పరీక్షా కేంద్రం వద్దకు బయట వ్యక్తులు రాకుండా పోలీసులు అన్ని చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.



పరీక్షా కేంద్రం వద్దకు వచ్చిన యువకులను పట్టుకొనే ప్రయత్నం చేస్తున్న మహిళా పోలీస్

గ్రావెల్ దోపిడీకి అడ్డేది?

గంగవరంలో యథేచ్ఛగా తవ్వకాలు
పట్టపగలే దర్జాగా తరలింపు



గంగవరంలో జగనన్న లేఅవుట్ వద్ద తవ్వకాలు జరపడంతో ఏర్పడిన గొయ్యి

- అధికార పార్టీ నేతల అండదండలతో రెచ్చిపోతున్న అక్రమార్కులు
- వలంటీర్ ప్రమేయం ఉందని ఆరోపణలు
- ధ్వంసమవుతున్న జగనన్న లేఅవుట్
- పట్టించుకోని రెవెన్యూ, గనులశాఖ అధికారులు

సబ్బవరం, మార్చి 23: జీవీఎంసీ 88వ వార్డు పరిధిలో గ్రావెల్ దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. అధికార పార్టీ నేతల అండదండలతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. జగనన్న కాలనీ లేఅవుట్‌లోనే దర్జాగా తవ్వకాలు సాగిస్తున్నారు. పట్టపగలే తవ్వకాలు జరిపి తరలిస్తున్నా రెవెన్యూ, గనులశాఖ అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

జీవీఎంసీ 88వ వార్డు గంగవరంలోని కొండవాలు ప్రాంతంలో పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా గతంలో జగనన్న లేఅవుట్ వేశారు. అయితే ఈ లేఅవుట్‌లో గ్రావెల్‌ను కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా తవ్వుకుపోతున్నారు. ఆఖరికి మట్టిని కూడా వదలడం లేదు. అధికార పార్టీ నేతల అండదండలు ఉండడంతో పగలు కూడా తవ్వకాలు జరుపుతున్నారు. కొందరు ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

రైలు ఢీకొని బాలుడి మృతి

అనకాపల్లి టౌన్, మార్చి 23 : అనకాపల్లి-తాడి రైల్వేస్టేషన్ మధ్య రాజుపాలెం సమీపాన శనివారం గుర్తు తెలియని రైలు ఢీకొన్న సంఘటనలో సాలాపువానిపాలెం గ్రామానికి చెందిన సాలాపు రాహుల్ (16) మృతి చెందినట్టు దువ్వాడ జీఆర్‌పీ ఎస్ఐ కె. శాంతారామ్ తెలిపారు. రాహుల్ ఉదయం జిమ్‌కు ఇంట్లోంచి బయలుదేరి వెళ్లి రైల్వే ట్రాక్ మీదుగా నడుచుకుని వెళ్తుండగా విజయవాడ నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న గుర్తు తెలియని రైలు ఢీకొందన్నారు. బాలుడిని 20 మీటర్ల వరకు ఈడ్చుకుని పోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. బాలుడు పాలిటెక్నికల్ మొదటి సంవత్సరం విద్యాభ్యాసం చేస్తున్నారని తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శాంతారామ్ తెలిపారు.

చెట్టు పైనుంచి జారిపడి గీత కార్మికుడి మృతి

పాయకరావుపేట, మార్చి 23 : పట్టణ శివారులో శనివారం తాటిచెట్టు పైనుంచి ప్రమాదవశాత్తూ జారిపడి గీత కార్మికుడు మృతిచెందాడు. ఇందుకు సంబంధించి ఎస్ఐ జోగారావు అందించిన వివరాలిలా ఉన్నాయి. పాయకరావుపేటలోని పాతపేటకు చెందిన గుర్రుర్తి ఏసు(43) కల్లు గీత కార్మికుడిగా పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం ఉదయం పట్టణ శివార్లలోని శ్మశానం వద్ద ఉన్న తాటిచెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా ప్రమాదవశాత్తూ జారి కింద పడి మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించామని ఎస్ఐ తెలిపారు. జరిగిన సంఘటనపై ఏసు భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

సబ్బవరం, మార్చి 23: సబ్బవరం-చోడవరం రోడ్డులో గంగిరెడ్డికాలనీ వద్ద ఈనెల 21న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి శనివారం వేకువజామున మృతిచెందాడు. పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. సబ్బవరం శివారు గొర్లివానిపాలెం దరి గంగిరెడ్ల కాలనీకి చెందిన ధనకొండ రాజు ఈనెల 21న చోడవరం రోడ్డులో టీ తాగి రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొట్టింది. దీంతో రాజు తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతన్ని ఆరిలోవలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శనివారం వేకువజామున రాజు మృతి చెందాడని అతని భార్య శాంతి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుడికి భార్య శాంతి, నలుగురు పిల్లలు ఉన్నారు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ దహన సంస్కారాలు నిమిత్తం రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వ నుంచి సాయం అందేలా చర్యలు తీసుకుంటామని కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పిన్నింటి రమణ తెలిపారు.

వీడిన మిస్టరీ

- మాజీ ఎమ్మెల్యే ఇంట్లో దోపిడీకి పాల్పడింది ఆయన కుటుంబ గురించి తెలిసిన వ్యక్తే
- అప్పులు తీర్చేందుకు చోరీకి ప్రణాళిక
- హైదరాబాద్‌లో నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

విశాఖపట్నం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి):
వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్ ఇంట్లో జరిగిన దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. తైనాల కుటుంబం గురించి బాగా తెలిసిన వ్యక్తే నిందితుడని పోలీసులు గుర్తించారు. అతడిని హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకుని నగరానికి తీసుకొచ్చి విచారిస్తున్నారు. దీనికి సంబంధించి విశ్వసనీయ సమాచారం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సమీపంలోని ఒక గ్రామానికి చెందిన యువకుడు కొన్నాళ్ల కిందట డాబాగార్డెన్స్ లలితానగర్‌లోని తైనాల విజయ్‌కుమార్ నివాసానికి వచ్చాడు. తైనాల బంధువుల పేర్లు ప్రస్తావించి వారంతా తనకు తెలిసిన వారేనంటూ మాటలు కలిపాడు. ఇంట్లో తైనాలతోపాటు ఆయన భార్య మాత్రమే ఉంటున్నారని గుర్తించాడు. తైనాల లేని సమయంలో ఇంట్లో దోపిడీ చేస్తే...తన అప్పులు తీరిపోతాయనుకున్నాడు. తన పథకం అమలు చేయడానికి తైనాల దినచర్యపై కొద్దిరోజులుగా నిఘా పెట్టాడు. ఎస్.కోట నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న తైనాల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత ప్రతిరోజూ మధ్యాహ్నం ఇంటి నుంచి బయలుదేరి తిరిగి రాత్రికి చేరుకుంటున్నట్టు గుర్తించాడు. ఈనెల 21న తైనాల ఎస్.కోటలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిపోవడంతో రాత్రి ఏడున్నర సమయంలో కత్తి పట్టుకుని ఇంట్లోకి చొరబడ్డాడు. తన ఆనవాళ్లు తెలియకుండా ఉండేందుకు ముఖానికి మాస్క్, నెత్తిన టోపీ ధరించాడు. కిచెన్‌లో వంటచేస్తున్న తైనాల భార్య మెడపై కత్తిపెట్టి తాను చెప్పినట్టు వినకపోతే చంపేస్తానని బెదిరించాడు. బీరువాలోని బంగారం, నగదు తీసి ఇవ్వాలని చెప్పడంతో ఆమె ప్రాణభయంతో అలాగే చేశారు. నిందితుడికి అప్పు ఇచ్చిన వ్యక్తి అదే సమయంలో ఫోన్ చేశాడు. 'ఏడున్నరకు డబ్బులు తీసుకోవడానికి డాబాగార్డెన్స్‌కు రమ్మన్నావ్. నేను అక్కడే ఉన్నా. నువ్వు ఇంకా రాలేదేమంటూ' ప్రశ్నించాడు. దీనికి సమాధానంగా నిందితుడు...'అదేపనిలో ఉన్నా, వచ్చేస్తున్నా' అంటూ సమాధానం ఇచ్చాడు. తర్వాత బంగారం, నగదుతో ఇంటి నుంచి బయటపడ్డాడు. నడుచుకుంటూ డాబాగార్డెన్స్ రోడ్డులోకి వెళ్లి అక్కడ తాను బాకీ ఉన్న వ్యక్తికి తాను దోపిడీ చేసిన డబ్బులో కొంత ఇచ్చాడు. అక్కడ ఆటో ఎక్కి కాన్వెంట్ జంక్షన్ మీదుగా ఎన్ఏడీకి చేరుకున్నాడు. అక్కడ బస్సు ఎక్కి రాజమండ్రి వెళ్లి, అక్కడి నుంచి రైలులో హైదరాబాద్ వెళ్లిపోయాడు. అప్పటికే పోలీసులు నిందితుడి ఆచూకీని సీసీ కెమెరాల ఫుటేజీతోపాటు సెల్‌ఫోన్ టవర్ లోకేషన్ ఆధారంగా గుర్తించారు. అతడిని ట్రాకింగ్ చేస్తూ ప్రత్యేక బృందం హైదరాబాద్ వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకుంది. దోపిడీ చేసిన నగలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. నిందితుడిని నగరానికి తీసుకొచ్చి పోలీసులు విచారిస్తున్నట్టు తెలిసింది. ఆదివారం పూర్తి వివరాలను మీడియాకు వెల్లడించే అవకాశం ఉంది.

ఎయిడెడ్

... 5వ పేజీ తరువాయి

తొలితరం విద్యా సంస్థలుగా పేరున్న నగరంలోని సీబీఎం హైస్కూల్, ఏవీఎన్ ఉన్నత పాఠశాల, సెయింట్ ఆంథోని పాఠశాలలతోపాటు వేలాది మందికి విద్యను అందించిన ఎస్‌ఈ రైల్వే హైస్కూల్, ఎన్ఏడీ స్కూలు, సెయింట్ పీటర్స్ ఉన్నత పాఠశాల, నర్సీపట్నంలో ఆర్‌సీఎం ఉన్నత పాఠశాల ఉన్నాయి. ప్రాథమిక, యూపీ పాఠశాలలు పదుల సంఖ్యలో ఉన్నాయి. ఈ పాఠశాలల్లో సుమారు ఐదు వేల మంది వరకు చదువుకునేవారు. ఇక్కడ పనిచేసే టీచర్లు, సిబ్బందిని విద్యా శాఖ పరిధిలోని ప్రభుత్వ స్కూళ్లకు బదిలీ చేశారు. ఆయా పాఠశాలలు మూతపడడంతో అక్కడ చదువుకునే పేద విద్యార్థులు చెల్లాచెదురయ్యారు. ఏవీఎన్, సీబీఎం, సెయింట్ ఆంథోనీ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు సమీపంలోని జీవీఎంసీ పాఠశాలల్లో చేరారు. కూతవేటు దూరంలో ఉన్న స్కూలు నుంచి మూడు నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలలకు పిల్లలు వెళ్లాల్సి రావడంతో అప్పట్లో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేశారు. ఇంకా జ్ఞానాపురంలో సెయింట్ పీటర్స్ బాయ్స్ స్కూలు మూసివేతతో కంచరపాలెం రామ్మూర్తిపంతులుపేట జీవీఎంసీ పాఠశాలకు, రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న రైల్వే స్కూలు, మర్రిపాలెంలోని ఎస్‌ఈ రైల్వే స్కూలు మూతతో నాలుగు కిలోమీటర్ల దూరంలోని గోపాలపట్నం పాఠశాలకు విద్యార్థులు వెళ్లాల్సి వచ్చింది. కొద్దోగొప్పో స్థోమత ఉన్న కుటుంబాలు తమ పిల్లలను ఇంటికి సమీపంలో ఉన్న ప్రైవేటు స్కూళ్లల్లో చేర్పించుకోగా, పేద కుటుంబాలు దూరమైనా గత్యంతరం లేక ప్రభుత్వ పాఠశాలలకు పంపాయి. మరికొందరైతే పిల్లలను చదువు మాన్పించినట్టు ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసిన టీచర్ ఒకరు తెలిపారు. ప్రధానంగా బాలికలు చదువుకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇక భీమిలిలో సెయింట్ ఆన్స్ పాఠశాల వచ్చే విద్యా సంవత్సరం నుంచి మూతపడనున్నది. విద్యా రంగ అభివృద్ధికి గడచిన ఐదేళ్లుగా తాము ఎంతో కృషిచేశామని వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. కానీ ఎయిడెడ్ విద్యా సంస్థలను విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల వేలాది మంది విద్యార్థులు ఇబ్బందిపడ్డారు. అనేకమంది చదువుకు దూరం అయ్యారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	102.00
లైవ్ ధర	122.00
విత్ స్కిన్	214.00
స్కిన్ లెస్	224.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చెక్ పోస్టుల వద్ద పక్కాగా తనిఖీలు

- ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలి
- పోలీసు అధికారుల సమీక్షలో ఎస్పీ కేవీ మురళీకృష్ణ



పోలీసు అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో తనిఖీలు పక్కాగా జరగాలని ఎస్పీ కేవీ మురళీకృష్ణ అధికారులను ఆదేశించారు. స్థానిక పోలీసులు, కేంద్ర పోలీసు బలగాలతో కలిసి ఉమ్మడి ఆధ్వర్యంలో తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అందరూ కలిసి పనిచేయాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలీసులు నిష్పక్షపాతంగా బాధ్యతలు నిర్వహించాలన్నారు. ఎన్నికల నియమావళి అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. అనంతరం ఎన్నికల సందర్భంగా పోలీసుల విధులపై దిశా నిర్దేశం చేశారు. పోలీసు స్టేషన్‌ల పరిధిలో ముఖ్యమైన కేసులు, ప్రాపర్టీ కేసులు, పోక్సో యాక్టు కేసులు, గంజాయి కేసులు, మిస్సింగ్ కేసులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్ష జరిపారు. సమావేశంలో ఏఎస్పీలు విజయ్‌భాస్కర్, సత్యనారాయణ, డీఎస్పీలు అప్పలరాజు, కేవీ సత్యనారాయణ, భవ్య, ఇన్‌స్పెక్టర్లు హాజరయ్యారు.

ప్రశాంతంగా టెన్త్ భౌతిక శాస్త్రం పరీక్ష

అనకాపల్లి రూరల్, మార్చి 22 : జిల్లాలోని పదో తరగతి పరీక్షల్లో భాగంగా భౌతికశాస్త్రం పరీక్షను శనివారం నిర్వహించినట్టు డీఈవో వెంకటలక్ష్మి తెలిపారు. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 21,258 మందికి 21,139 మంది హాజరు కాగా 119 మంది గైర్హాజరు అయినట్టు చెప్పారు. ఈ పరీక్షకు ప్రైవేటు విద్యార్థులు 1,617 మంది హాజరుకావాల్సి ఉండగా 1,229 మంది హాజరై 388 మంది గైర్హాజరు అయినట్టు తెలిపారు. రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు 22,875 మంది హాజరుకావాల్సి ఉండగా 22,368 మంది హాజరై.. 507 మంది గైర్హాజరు అయినట్టు తెలిపారు.

'నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు'

అనకాపల్లి అగ్రికల్చర్, మార్చి 23 : వివిధ పంటలలో అధిక దిగుబడులు పొందేందుకు జిల్లాకు అనువైన, నాణ్యమైన విత్తనాలను రైతులు సమకూర్చుకోవాలని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ పీవీకే జగన్నాథరావు తెలిపారు. శనివారం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఉత్తమమైన రకాలను ఉపయోగించి పండించిన పంటల ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు మాట్లాడుతూ జిల్లాలో రబీ సీజన్‌లో నువ్వులు, జనుము వంటి పంటలు ఆశాజనకంగా ఉన్నాయని తెలియజేశారు. ప్రస్తుత తరుణంలో పప్పుధాన్యాలు, నువ్వులు, జనుము పంటలకు మార్కెట్లో మంచి ధర లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ సీహెచ్ ముకుందరావు, డాక్టర్ టి.శ్రీలత, డాక్టర్ డి. ఆదిలక్ష్మి, డాక్టర్ ఎం.విశాలాక్షి, డాక్టర్ డి. ఉమామహేశ్వరరావు, డాక్టర్ రామలక్ష్మి, డాక్టర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

నిందితులను గుర్తించడంలో క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్ ముఖ్యం

- జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ



జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణను సత్కరిస్తున్న లా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ డి. సూర్యప్రకాశరావు

సబ్బవరం, మార్చి 23: నిందితులను గుర్తించడంలో పోలీసులకు, న్యాయవాదులకు క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్ ముఖ్యమని జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ అన్నారు. మండలంలోని అసకపల్లి దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో శనివారం 'క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్-5.0 నేషనల్ లీగల్ కాంపిటేషన్'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. దర్యాప్తు అధికారి క్రైమ్ సీన్ అబ్జర్వేషన్‌లో నిందితులను గుర్తించడంలో ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. ఇటువంటి పోటీలతో న్యాయ విద్యార్థులు విజ్ఞానం, నైపుణ్యం మెరుగుపరుచుకోవాలన్నారు. కేసులు దర్యాప్తు, చట్టాన్ని అమలు చేయడంలో న్యాయ విద్యార్థులకు ఎస్పీ మురళీకృష్ణ అవగాహన కల్పించారు. వర్సిటీ లీగల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉప కులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ నందినీ సీపీ, ప్రోగ్రామ్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ లక్ష్మి, పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సీఐ పిన్నింటి రవమణ, వర్సిటీ ఫ్యాకల్టీ మెంబర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపమాక ఆలయానికి పోటెత్తిన భక్తులు


ఉపమాక ఆలయంలో బారులు తీరిన భక్తులు

నక్కపల్లి, మార్చి 23: మండలంలోని ఉపమాక క్షేత్రానికి శనివారం భక్తులు పోటెత్తారు. కల్యాణ వేంకటేశ్వరుడిని దర్శించుకోవడం కోసం దూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల గోవింద నామస్మరణతో ఆలయం మార్మోగింది. ఆలయ అర్చకులు భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. శ్రీవారి కల్యాణోత్సవాల్లో భాగంగా పాయకరావుపేట, నక్కపల్లి, గోకులపాడు, ఎస్.రాయవరం, వేంపాడు గ్రామాలకు చెందిన మహిళా బృందాలు చేసిన కోలాట ప్రదర్శనలు విశేషంగా అలరించాయి. అన్నమయ్య కీర్తనలు, శివ, కేశవుల గీతాలకు చేసిన కోలాట ప్రదర్శనలు విశేషంగా అలరించాయి. ఉపమాక ఆలయంలో శనివారం కల్యాణ వేంకటేశ్వరుడి సన్నిధిలో ప్రముఖ తెలుగు పండితురాలు డాక్టర్ గాయత్రీదేవి ఆధ్వర్యంలో విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. ఇందులో టీచర్ హండీ, గురుభవానీ రాంబాబు, సుంకర శ్రీను, తాతాజీ కృష్ణప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

'పేట'లో వైసీపీ నేత ఇంట్లో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు

- వలంటీర్లకు డబ్బులు పంచుతున్నారని జిల్లా అధికారులకు ఫిర్యాదు
- వెంటనే వచ్చి తనిఖీ చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్
- డబ్బులు దొరక్కపోవడంతో వెనుతిరిగిన స్క్వాడ్
- సమాచారం ముందుగా అందడంతో ఇంటి వెనుక నుంచి వలంటీర్లను పంపారని టీడీపీ నాయకుల ఆరోపణ


వైసీపీ నాయకుడి ఇంట్లో తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్

పాయకరావుపేట, మార్చి 23 : పాయకరావుపేట పట్టణంలో శనివారం వైసీపీ నాయకులు వలంటీర్లకు డబ్బులు పంచుతున్నారని జిల్లా అధికారులకు ఫిర్యాదు అందడంతో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించింది. పట్టణంలోని వైసీపీ మండల మాజీ అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు ఇంట్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తల సమావేశం జరుగుతుండగా ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ వచ్చి తనిఖీలు చేసింది. వలంటీర్లకు డబ్బులు పంచుతున్నారని అందిన ఫిర్యాదు మేరకు తనిఖీలు చేశామని ఫ్లయింగ్ స్క్వాడ్ విజయలక్ష్మి తెలిపారు. దీనిపై ధనిశెట్టి బాబూరావు మాట్లాడుతూ కార్యకర్తల సమావేశం మాత్రమే ఏర్పాటు చేసుకున్నామని, దీనికి వలంటీర్లు ఎవరూ రాలేదని తెలిపారు. దీంతో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిణి విజయలక్ష్మి మాట్లాడుతూ ఇంట్లో తనిఖీ చేయాలని చెప్పడంతో బాబూరావు ఇంట్లోని గదులు, బీరువాలను తెరిచి చూపించారు. బాబూరావు ఇంట్లో వలంటీర్లు కనిపించకపోగా డబ్బులు కూడా దొరకలేదు. అనంతరం ఆమె పార్టీ నాయకులతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి అనుమతులు లేకుండా పార్టీ సమావేశాలు పెట్టకూడదని, ఇక నుంచి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలియజేసి వెళ్లిపోయారు. ఆమె వెంట పాయకరావుపేట పంచాయతీ కార్యదర్శి జె.చంద్రశేఖర్, పలువురు సచివాలయ సిబ్బంది ఉన్నారు. ఇదిలావుండగా ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ వస్తోందని ముందుగానే వైసీపీ నాయకులకు సమాచారం అందడంతోనే ధనిశెట్టి బాబూరావు ఇంటికి వచ్చిన వలంటర్లను ఇంటి వెనుక నుంచి పంపించి, డబ్బులు అధికారులకు కనిపించకుండా దాచేశారని పలువురు టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. కాగా పట్టణంలోని లింగాలతోట కాలనీలోని ఓ వైసీపీ నాయకుడి ఇంట్లో శనివారం సాయంత్రం పలువురు వలంటీర్లతో నాయకులు సమావేశం ఏర్పాటుచేసినట్టు తెలిసింది. ఓటర్ల లిస్టులో పెన్షన్‌దారులతోపాటు వైసీపీ అనుకూలమైనవారి పేర్లు గుర్తించి జాబితాలు అందజేయాలని ఆదేశించినట్టు తెలుస్తోంది.

750 మంది బైండోవర్

- రావికమతం, కొత్తకోట ఎస్ఐలు ధనుంజయనాయుడు, లక్ష్మణరావు

రావికమతం, మార్చి 23 : సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా రావికమతం, కొత్తకోట పోలీసు స్టేషన్ల పరిధిలో 750 మందిని తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసిట్టు ఎస్ఐలు ధనుంజయనాయుడు, లక్ష్మణరావు శనివారం తెలిపారు. గత ఎన్నికల సమయంలో అల్లర్లకు ప్రేరేపించిన, చెడు ప్రవర్తన కలిగిన, సారా, గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్న వారిని, అలాగే, ఇరు పార్టీలకు చెందిన పలువురు నాయకులను బైండోవర్ చేసినట్టు చెప్పారు. వీరంతా ఎన్నికల నియమావళి ప్రకారం గ్రామాల్లో శాంతి యుతంగా ఉండాలని, ఎటువంటి అల్లర్లకు కారకులు కాకూడదని వివరించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బీజేపీ పాలనలో వ్యవస్థలన్నీ విధ్వంసం

- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేష్



చేతులెత్తి సంఘీభావం తెలియజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

తుమ్మపాల, మార్చి 23 : బీజేపీ పాలనలోని దేశంలోని ప్రభుత్వ రంగ వ్యవస్థలన్నీ పూర్తిగా విధ్వంసమయ్యాయని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి. ఓబులేష్ అన్నారు. శనివారం రోటరీ కల్యాణ మండపంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్మికరంగాన్ని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వరంగ సంస్థలు నిలబడాలంటే కేంద్రంలోని బీజేపీని, రాష్ట్రంలోని వైసీపీని ఈ దఫా ఎన్నికల్లో ఓడించాల్సిందేనన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డికి అధికార కాంక్ష తప్ప మరేమి లేదన్నారు. ఎలాగైనా మరలా అధికారం చేపట్టాలని బూటకపు హామీలతో కార్మికులు, రైతులను మోసం చేసేందుకు తెగబడుతున్నారన్నారు. గత హామీలను జగన్మోహన్‌రెడ్డి కచ్చితంగా అమలు చేయాల్సిందేనన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలన్నారు. అనంతరం ఏఐటీయూసీ జిల్లా ప్రథమ మహాసభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర సమితి నాయకులు డాక్టర్ బుసిరాజు, అచ్యుతరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, ఏఐటీయూసీ కన్వీనర్ వైఎన్ భద్రం, సమితి సభ్యులు గనిశెట్టి ఏసుదాసు, కోన లక్ష్మణ, ఎల్‌వీ రమణ, పెంటకోట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఐపీఎల్ మ్యాచ్‌ల టికెట్ల అమ్మకం

విశాఖపట్నం (స్పోర్ట్సు), మార్చి 23: నగరంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరగనున్న ఐపీఎల్ మ్యాచ్‌లకు సంబంధించి టికెట్ల అమ్మకాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 3న ఢిల్లీ క్యాపిటల్స్-కోల్‌కతా నైట్‌రైడర్స్ మధ్య జరిగే మ్యాచ్‌కు సంబంధించిన టికెట్ల విక్రయాలు పేటీఎం ఇన్‌సైడర్ వెబ్‌సైట్ ద్వారా ఉదయం 10 గంటల నుంచి చేపట్టనున్నట్టు ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యం తెలిపింది. ఈనెల 31న ఢిల్లీ క్యాపిటల్స్-చెన్నై సూపర్‌కింగ్స్ జట్ల మధ్య జరిగే మ్యాచ్‌కు టికెట్ల అమ్మకాలు ఈనెల 27 నుంచి జరుగుతాయని పేర్కొంది. టికెట్ల ధరలను రూ.1,000, రూ.1500, రూ.2000, రూ.3,000, రూ.3,500, రూ.5,000, రూ.7,500గా నిర్ణయించింది. కాగా, ఆన్‌లైన్ టికెట్లను మామూలు టికెట్లుగా మార్చుకునేందుకు నగరంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం, ఏసీఏ-వీడీసీఏ 'బి' గ్రౌండ్‌లో కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నారు. ఢిల్లీ క్యాపిటల్స్-కోల్‌కతా నైట్‌రైడర్స్ మధ్య జరిగే మ్యాచ్ టికెట్లు కొనుగోలు చేసినవారు ఈనెల 26 నుంచి, ఢిల్లీ క్యాపిటల్స్-చెన్నై సూపర్‌కింగ్స్ మ్యాచ్‌కు ఆన్‌లైన్ టికెట్ పొందినవారు ఈనెల 27 నుంచి ఆయా కేంద్రాల్లో మార్చుకోవాలని స్పష్టం చేశారు. కాగా టికెట్ల ధరలు క్రీడాభిమానులలో నిరుత్సాహాన్ని కలిగిస్తున్నాయి. ప్రారంభ టికెట్ ధర రూ.1000 కావడంతో ఆలోచనలో పడుతున్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

అచ్యుతాపురం రూరల్, మార్చి 23: మండలంలోని చోడపల్లి గ్రామ శివార్లలో పేకాట శిబిరంపై పోలీసులు శనివారం దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.7వేల నగదును స్వాధీనంలో చేసుకున్నట్టు ఎస్ఐ నారాయణరావు తెలిపారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరిగినట్టు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసు స్టేషన్‌కు తెలియజేయాలని ఆయన కోరారు.

గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు



ఎస్.రాయవరంలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

ఎస్.రాయవరం, మార్చి 23: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు మండలంలోని ఎస్.రాయవరం, దార్లపూడి, పెట్టుగోళ్లపల్లి, పెదగుమ్ములూరు, జేవీ పాలెం, సైతారుపేట, సర్వసిద్ధి, అడ్డరోడ్డు తిమ్మాపురం గ్రామాల్లో సీఐ అప్పన్న ఆధ్వర్యంలో శనివారం కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఓటర్లు ధైర్యంగా వచ్చి ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ విభీషణరావు పాల్గొన్నారు.

అప్పలనాయుడు సేవలు ప్రశంసనీయం

తుమ్మపాల, మార్చి 23 : కార్మిక రంగానికి కడిరోతు అప్పలనాయుడు అందించిన సేవలు ప్రశంసనీయమని రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహనరావు అన్నారు. శనివారం మార్టూరులో జరిగిన అప్పలనాయుడు సంస్మరణ సభ నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్మికసంఘాల నాయకులు జి. సూర్యారావు, ఓ. లక్ష్మీకుమారి, నందారపు భాస్కరరావు, శివాజీరావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు జైభారత్ ఆత్మీయ సమావేశం

తుమ్మపాల, మార్చి 23 : అనకాపల్లి పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం జై భారత్ ఆత్మీయ సమావేశం జరగనున్నట్టు జైభారత్ అసెంబ్లీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ కనిశెట్టి సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథులుగా పార్టీ వ్యవస్థాపకులు జేడీ లక్ష్మీనారాయణ, ఉత్తరాంధ్ర కన్వీనర్ జైదేవ్ హాజరుకానున్నట్టు చెప్పారు.

టాలెంట్ టెస్ట్‌లో అమృత వర్షిణికి రెండో ర్యాంకు



అమృతవర్షిణి

ఎస్.రాయవరం, మార్చి 23: రాష్ట్ర స్థాయి గోదావరి తెలుగు టాలెంట్ టెస్ట్‌లో స్థానిక వినయ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న దూలం అమృత వర్షిణి రెండో ర్యాంకు సాధించినట్టు స్కూల్ ప్రతినిధి కొలగాని వరప్రసాద్ శనివారం తెలిపారు. ఈ నెల తేది 18న ఓఎంఆర్ సీటు ద్వారా రాష్ట్ర స్థాయి టెస్ట్ నిర్వహించడం జరిగిందన్నారు. అమృతను కరస్పాండెంట్ బత్తుల వాసు, ప్రిన్సిపాల్ వెలగా అప్పారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

వైసీపీకి మండల ఉపాధ్యక్షుడు రమణబాబు రాజీనామా

మునగపాక (తుమ్మపాల), మార్చి 23: వైసీపీ మండల ఉపాధ్యక్షుడు అల్లవరపు రమణబాబు ఆ పార్టీ పదవులకు, సభ్యత్వానికి శనివారం రాజీనామా చేశారు. ఆయనతోపాటు మాజీ వైస్ ఎంపీపీ ముత్యాల భాస్కరరావు, వార్డు మెంబర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. ఈ సందర్భంగా రమణబాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే కన్నబాబు పనితీరు నచ్చక పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. భవిష్యత్తులో అభివృద్ధిని కాంక్షించే పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్నట్టు ఆయన తెలిపారు.

వైభవంగా దుర్గమాంబ ఆలయ వార్షికోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పరవాడ, మార్చి 23 : ఈ.బోనంగి పంచాయతీ పరిధి బొద్దపువానిపాలెంలో శనివారం దుర్గమాంబ ఆలయ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆరు గంటల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సర్పంచ్ బొద్దపు శ్రీనివాసకానులు, నాయకులు మేడిశెట్టి బాలాజీ నాయుడు, బి. కృష్ణారావు, సూర్యప్రకాష్ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

27న కుంచావారి గౌరీ పరమేశ్వరుల పంచలోహ విగ్రహ ప్రతిష్ఠ

అనకాపల్లి టౌన్, మార్చి 23 : స్థానిక చిననాలుగురోడ్ల జంక్షన్‌లోని కుంచావారి గౌరీ పరమేశ్వరుల ఆలయంలో ఈనెల 27, 28 తేదీల్లో పంచలోహ ఉత్సవ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతుందని ఉత్సవ కమిటీ చైర్మన్ ఎం. వీరభద్రరావు చెప్పారు. ఇందుకు సంబంధించిన కార్యక్రమ పత్రాన్ని పట్టణ సీఐ జి. శంకరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ ప్రముఖ వ్యాపారవేత్త మావూరి వెంకటరమణ, పద్మావతి ఆర్థిక సహకారంతో 250 కిలోల గౌరీపరమేశ్వరుల పంచలోహ విగ్రహం తయారు చేయించామన్నారు. 27న పంచలోహ విగ్రహం ఊరేగింపు, 28న 108 కలశాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం ప్రముఖ బిల్డర్ కాండ్రేగుల నాయుడు, భాగ్యలక్ష్మి దంపతుల ఆర్థిక సహకారంతో అన్నసమారాధన నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షుడు పాండ్రంకి సత్యారావు, కోరుకొండ సాంబశివరావు, కొమ్మోజు రామకృష్ణ, పాలూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి వినతి



ఏవోకు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

అనకాపల్లి టౌన్, మార్చి 23 : ఏపీయూడబ్ల్యూజే అనకాపల్లి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం జర్నలిస్టులు కోర్కెల దినం పాటించారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా జర్నలిస్టులు ఆర్డీవో కార్యాలయ ఏవో గంగాధరరావుకు వినతిపత్రం అందజేశారు. మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, జర్నలిస్టులు, మీడియా సంస్థల భద్రతకు జాతీయస్థాయిలో ఒక ప్రత్యేక చట్టం చేయాలని, వర్కింగ్ జర్నలిస్టులకు వేతన సవరణ కోసం వేజ్‌బోర్డు నియమించాలని, జర్నలిస్టులకు గతంలో ఇచ్చి రద్దు చేసిన రైల్వే రాయితీ పాస్‌లు పునరుద్ధరించాలంటూ కోరారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మద్దాల రాంబాబు, జిల్లా అధ్యక్షుడు పెంటకోట జోగినాయుడు, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కె.శేఖర్, అవతారం, క్లబ్ ప్రతినిధులు మళ్ల భాస్కరరావు, శ్రీనివాసరావు, సూకేష్, రమణాజీ, కేవీ రమణ, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో..

జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి కె.చంద్రరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే పాయకరావుపేట ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల కోర్కెల దినం ఘనంగా నిర్వహించారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దారు సూర్యనారాయణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ కార్యదర్శి దాసరి శ్రీనివాసరావు, నాయకులు రాజా, లోవరాజు, సత్యనారాయణ, నాగార్జున, రాము తదితరులు పాల్గొన్నారు.

మండల కాంప్లెక్స్ ఆవరణలో ప్రైవేటు షాపు

- కొద్ది నెలలుగా నిర్మాణం
- పట్టించుకోని అధికారులు
- షాపు పెట్టినట్టు తెలియదు : ఎంపీడీఓ



మండల కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన షాపు

పాయకరావుపేట, మార్చి 23 : స్థానిక మండల కాంప్లెక్స్ ఆవరణలో ప్రైవేటు వ్యక్తి దర్జాగా షెడ్డు ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోలేదు. మండల కాంప్లెక్స్‌లో ఎంపీడీఓ, తహసీల్దారు, ఎంఈఓ, వ్యవసాయ శాఖ, సబ్ ట్రెజరీ, వెలుగు, జలవనరుల శాఖ తదితర ప్రభుత్వ కార్యాలయాలు ఒకే చోట ఏర్పాటు చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఇదే ఆవరణలో సచివాలయం-౨, రైతు భరోసా కేంద్రం, తదితర కార్యాలయాల భవనాలు నిర్మించారు. కాంప్లెక్స్ చుట్టూ ప్రహరీగోడ కూడా ఉంది. అయితే ఓ వ్యక్తి మండల కాంప్లెక్స్ ఆవరణలోని వ్యవసాయ శాఖ కార్యాలయం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండా దర్జాగా షెడ్డు ఏర్పాటు చేసుకుని వ్యాపారం ప్రారంభించాడు. గత కొద్ది నెలలుగా షెడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న పక్కనే ఉన్న అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడం విశేషం. షెడ్డుకి వైసీపీ రంగు కనిపించేలా పెయింటింగ్ వేయడం చూస్తుంటే స్థానిక వైసీపీ నాయకుల అండతోనే షాపు ఏర్పాటుచేసినట్టు తెలుస్తోంది. దీనిపై ఎంపీడీఓ కె.స్వప్నను వివరణ కోరగా.. మండల కాంప్లెక్స్ ఆవరణలో ప్రైవేటు షాపు ఏర్పాటుచేసినట్టు తనకు తెలియదన్నారు. కాంప్లెక్స్ ఆవరణలో ప్రైవేటు వ్యక్తులు షాపు పెట్టుకునేందుకు తాను ఎటువంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. సిబ్బందిని పంపించి షాపు నిర్వాహకుడిని అడిగితే షెడ్డు ఏర్పాటు చేసుకునేందుకు గత ఎంపీడీఓ నోటిమాటగా అనుమతి ఇచ్చారని తెలియజేశాడని, తాను స్వయంగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళులు



మునగపాకలో భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, మార్చి 23 : స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో శనివారం డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురు 93వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, సర్వజన ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కోరిబిల్లి పరమేష్, విద్యార్థి సంఘాల నాయకులు సీహెచ్. శివాజీ, ఎస్. రమణ స్వాతంత్ర సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన డిబేట్‌లో ప్రథమ బహుమతిని కృష్ణవేణి, ద్వితీయ బహుమతిని హరిప్రియ, తృతీయ బహుమతి భవాని గెలుచుకున్నారు. వ్యాసరచన పోటీల్లో వి. రాజ్యలక్ష్మి, జె. ప్రియాంక, కిరణ్ వరుసగా బహుమతులు గెలుచుకున్నారు. వీరికి లోకనాథం జ్ఞాపికలను బహూకరించారు. అలాగే స్థానిక ఉడ్‌పేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆళ్ల ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం బలిరెడ్డి శ్రీనివాసరావు, బొట్టా చిన్నియాదవ్, బొబ్బిలి గోవిందరాజు, ముగడ అప్పారావు పాల్గొన్నారు. అలాగే స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో భారత స్వాభిమాన ట్రస్ట్, పతాంజలి యోగా సమితి జిల్లా అధ్యక్షుడు భీశెట్టి దొరంనాయుడు ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో పెంటకోట సుబ్రహ్మణ్యం, కోలపర్తి కన్నబాబు, భీమరశెట్టి శ్రీనివాసరావు, కాండ్రేగుల చిన్న మన నివాళులర్పించారు.

పరవాడలో.. భగత్‌సింగ్ 93వ వర్ధంతిని శనివారం స్థానిక సంతబయలు వద్ద నిర్వహించారు. తొలుత భగత్‌సింగ్ చిత్రపటానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వాసంశెట్టి రవి, దేవరాజు, ఈశ్వరరావు, నాగరాజు, శంకరముని తదితరులు పాల్గొన్నారు. అలాగే ఐద్వా ఆధ్వర్యంలో స్థానిక బాలికోన్నత పాఠశాలలో భగత్‌సింగ్ చిత్రపటానికి ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి. మాణిక్యం పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాజేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో.. స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద శనివారం విప్లవ వీరులు భగత్‌సింగ్, రాజుగురు, సుఖదేవ్‌ల 93వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. విప్లవవీరుల చిత్రపటాల వద్ద సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, మండల కన్వీనర్ ఎం.రాజేశ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జి. రమణ, కె.దుర్గ పాల్గొన్నారు.

అచ్యుతాపురం రూరల్‌లో.. మండలంలోని మోసయ్యపేట శివారు కొత్తూరులో భగత్‌సింగ్ విగ్రహానికి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కర్రి అప్పారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు రొంగలి రాము, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కూండ్రపు సోమునాయుడు, కడారి అప్పారావు పాల్గొన్నారు.

మునగపాక (తుమ్మపాల)లో.. భగత్‌సింగ్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పోరాటాలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వీవీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా శనివారం మునగపాక హైస్కూల్‌లో ఆయన విగ్రహానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు ఆళ్ల మహేశ్వరరావు, ఎస్. బ్రహ్మాజీ, టెక్కలి జగ్గఅప్పారావు, శేఖర్ పాల్గొన్నారు.

కాగడాలతో ప్రదర్శన



కాగడాలతో ప్రదర్శన చేస్తున్న మహిళలు

అనకాపల్లిటౌన్, మార్చి 23 : అమరవీరుల స్ఫూర్తితో మతోన్మాదుల నుంచి దేశాన్ని కాపాడుకుందామంటూ పట్టణంలో శనివారం రాత్రి కాగడాల ప్రదర్శన జరిగింది. సీఐటీయూ, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా కాగడాల ప్రదర్శన నిర్వహించారు. సీఐటీయూ కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ఈ ప్రదర్శన జరిగింది. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్. శంకరరావు, రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి.మణి, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చింతకాయల శివాజీ, ఎస్ఎఫ్ఐ జిల్లా కోశాధికారి రమణ, వి. సత్యవతి, అల్లు రాజు, కె.శాంతి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు పరిశీలించండి : జేసీ

అనకాపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో అన్ని పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులను పరిశీలించాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ జాహ్నవి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అనకాపల్లి జోనల్ కమిషనర్, ఏఈఆర్‌ఓలు, సెక్టార్ అధికారులు, ఎంపీడీఓలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో శాంతియుతంగా పోలింగ్ జరిగేలా చూడాలన్నారు. స్వీప్ ద్వారా ఓటింగ్ పెంచడంపై అవగాహన కల్పించాలన్నారు. పది రోజుల్లో అన్ని పోలింగ్ కేంద్రాలలో మలిక వసతులు పూర్తిగా ఉన్నాయో? లేవో? అనేది పరిశీలించి వసతులు కల్పించాలని సూచించారు. సమావేశంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ వీవీపీఐ నాయుడు, తహసీల్దారు ఎల్.మధుసూదన, ఎంపీడీవోలు మోహన్‌కుమార్, శేషుబాబు, డీటీ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ జాహ్నవి



కన్నుల పండువగా శ్రీవారి గరుడోత్సవ ఊరేగింపు

అనకాపల్లి టౌన్, మార్చి 23 : స్థానిక దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో భాగంగా శనివారం రాత్రి స్వామివారికి గరుడోత్సవ వాహనసేవ ఊరేగింపు కన్నుల పండువగా సాగింది. ఆలయం నుంచి ప్రారంభమైన ఈ ఊరేగింపు పట్టణంతోపాటు గవరపాలెంలోని పురవీధుల గుండా సాగింది. దారి పొడవున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఊరేగింపులో అన్నమాచార్య వాగ్గేయ వరదాయిని బృంద సభ్యులచే సంకీర్తనలు, కోలాటాలు, చిడతలు, తప్పెటగుళ్లు, గోవిందనామ సంకీర్తనలతో మారుమోగాయి. ఆలయ ఈవో టి. రాజసులోచన, ఆలయ అర్చకులు పులఖండం విజయబాబు, పులకండం గిరిబాబు, రాజేష్, ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణపై అవగాహన

ఎలమంచిలి, మార్చి 23: ప్రపంచ మానవాళి ఆరోగ్యానికి విఘాతంగా కలిగిస్తున్న క్షయ వాధి గురించి విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.చంద్రశేఖర్ అన్నారు. శనివారం కళాశాలలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధిని 2025 నాటికి దేశం నుంచి పారదోలాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, అందుకు అందరూ సహకరించాలన్నారు. విశ్రాంత డీఎం హెచ్ఓ డాక్టర్. ఎస్.అనురాధ క్షయ వ్యాధి వ్యాప్తి, లక్షణాలు, నిర్ధారణ, నివారణల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తూరులో.. క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేసి భారతదేశాన్ని గెలిపించాలని తగరంపూడి పీహెచ్‌సీ వైద్యులు నీలిమారాణి పిలుపునిచ్చారు. శనివారం సీతానగరం జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. తొలుత గ్రామంలో వైద్య అవగాహన ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ వి. చంద్రశేఖర్, ఎంపీహెచ్ఓ సన్యాసిరావు, కుంచంగి సీహెచ్‌వో కల్యాణి, కూండ్రం సీహెచ్‌వో గౌస్యబేగం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మునగపాక (తుమ్మపాల)లో.. క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ దుర్గా ప్రవల్లిక పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని మునగపాకలో క్షయవ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది దేవకాంత, అనురాధ, లక్ష్మి, ఉమామహేష్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

23 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, మార్చి 23 : మండలంలోని శనివారం రాత్రి వేర్వేరు చోట్ల పోలీసులు తనిఖీలు నిర్వహించి 23 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి పరవాడ సీఐ బాల సూర్యారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లంకెలపాలెం గ్రామానికి చెందిన షేక్ రాము ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి 18 క్వార్టర్ మద్యం సీసాలను కొనుగోలు చేసి తీసుకువెళ్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన సూరాడ కృష్ణమ్మ ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి ఐదు క్వార్టర్ మద్యం సీసాలను కొనుగోలు చేసి తీసుకువెళ్తుండగా పోలీసులు తనిఖీ చేసి, వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

10 మద్యం సీసాలు స్వాధీనం

మండలంలోని ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన చింతకాయల భారతి ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి 10 క్వార్టర్ మద్యం సీసాలను కొనుగోలు చేసి శనివారం రాత్రి తీసుకువెళ్తున్నారు. ఎస్ఐ మల్లేశ్వరరావు మార్గమధ్యలో ఆమె వద్ద గల మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఆమెపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

గ్రావెల్ దోపిడీకి అడ్డేది?

... 5వ పేజీ తరువాయి

డిమాండ్‌ను బట్టి గ్రావెల్ తవ్వి నేరుగా తరలించుకుపోయి సొమ్ము చేసుకుంటుండగా, మరికొందరు వెదుళ్లనరవ, కొత్తూరు, దువ్వాడ సమీపంలో సంధ్యానగర్ తదితర ప్రాంతాల్లో నిల్వ చేస్తున్నారు. కొన్ని నెలలుగా ఈ వ్యవహారం జరుగుతున్నా రెవెన్యూ, మైనింగ్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదులు చేసిన వారి సమాచారాన్ని అక్రమార్కులకు అధికారులు ఇస్తున్నారని వాపోతున్నారు. తవ్వకాలను అడ్డుకునే ప్రయత్నం చేస్తే దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంగవరానికి చెందిన అధికార పార్టీ నేతలు, అక్కడి వలంటీర్‌కు ఇందులో ప్రమేయం ఉందనే ప్రచారం జరుగుతోంది. గత తహసీల్దార్ వీరిపై ఫిర్యాదు చేసినా అప్పటి సీఐ కనీసం కేసు కూడా నమోదు చేయలేదని తెలిసింది. జగనన్న లేఅవుట్‌లో బేస్‌మెంట్ ఫిల్లింగ్‌కు అనుమతి పొందిన అక్రమార్కులు.. లేఅవుట్ సూపర్‌వైజర్లు, సిబ్బందితో కుమ్మక్కై గ్రావెల్ దోపిడీకి పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంధ్యానగర్ కాలనీ ఆర్చి వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసి అక్రమార్కుల ఆగడాలను అరికట్టాలని కోరుతున్నారు.

నాలుగు లీటర్ల సారా పట్టివేత

కశింకోట, మార్చి 23: మండలంలోని బుచ్చెయ్యపేటలో క్యానుతో నాలుగు లీటర్ల సారాను తరలిస్తున్న జి.రాజును అరెస్టు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ సూర్యారావు తెలిపారు. శనివారం గ్రామంలోని సాధారణ తనిఖీలు నిర్వహిస్తుండగా ఇంటి వద్ద అమ్మేందుకు జి.రాజు అనే వ్యక్తి తీసుకువెళ్తుండగా పట్టుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

నేడు బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపిక

కొత్తూరు, మార్చి 23: గోవాలో ఏప్రిల్ 6, 7 తేదీల్లో జరగనున్న ఇండియన్ బాడీ బిల్డర్స్ ఫెడరేషన్ (ఐబీబీఎఫ్) బాడీ బిల్డింగ్ పోటీలకు ఆంధ్రా జట్టు ఎంపిక ఆదివారం భీమవరంలో జరగనున్నదని అనకాపల్లి బాడీ బిల్డర్స్ అండ్ ఫిట్నెస్ అసోసియేషన్ కార్యదర్శి శిలపరశెట్టి బాబి ఒక ప్రకటనలో తెలిపారు. జట్టు ఎంపిక భీమవరం కె12 జిమ్ వద్ద ఉదయం 11 గంటలకు జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని బాడీ బిల్డర్స్ సద్వినియోగం చేసుకోవాలని అధ్యక్షుడు అమరపల్లి కృష్ణాజీ కోరారు.

‘సంధ్య’ యజమానుల్ని కఠినంగా శిక్షించాలి

- మాజీ మంత్రి దాడి వీరభద్రరావు



అనకాపల్లి టౌన్, మార్చి 23 : సంధ్య ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ యజమానుల్ని కఠినంగా శిక్షించాలని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మానవత్వం లేని ఈ మృగాలను, వారికి దన్నుగా నిలుస్తున్న రాజకీయ నాయకులను న్యాయస్థానాలు తమ విస్తృత అధికారాలను ఉపయోగించి శిక్షించాలని కోరారు. సుమారు లక్ష కోట్ల రూపాయల విలువైన భయంకరమైన మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్న సీబీఐ అధికారులను ఆయన అభినందిస్తున్నానన్నారు. దూరప్రాంత జిల్లాల నుంచి వచ్చిన నేరస్థులు విశాఖపట్టణాన్ని నేరాల అడ్డాగా తయారు చేస్తున్నారన్నారు. సీబీఐ వారు నేర పరిశోధన జాగిలాలను పంపమని కోరినపుడు విశాఖ పోలీస్ కమిషనర్ ఎందుకు వెళ్లారో, సీబీఐ విచారణలో చొరబడడానికి ఎందుకు ప్రయత్నించారో ప్రశ్నార్థకంగా ఉందన్నారు. ఆక్వా కంపెనీ వారు స్వయంగా అక్కడికి హాజరై కంటైనర్‌ను తెరవకుండా అడ్డుకున్నారంటే.. వారి వెనుక బలమైన రాజకీయ, పోలీస్ యంత్రాంగాలు ఉన్నట్టు అర్థమవుతోందన్నారు. దేశంలోని అనేక రాష్ట్రాలకు విశాఖ నుంచి వెళ్లిన మత్తు పదార్థాలే సమాజాన్ని నాశనం చేస్తున్నాయంటే విశాఖలో కట్టుదిట్టమైన పరిపాలనా వ్యవస్థ లేనట్టుగా రుజువవుతోందన్నారు. ఈ లక్ష కోట్ల రూపాయల విలువైన మత్తు పదార్థాలు ఎన్నికల్లో అమాయకులైన యువకులకు పంచి ఇచ్చేందుకే అన్న అపోహలు ఉన్నందున ఎన్నికల కమిషన్ కూడా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశానని దాడి వీరభద్రరావు తెలిపారు.

కొణతాలకు శిష్టకరణ సాధికార సమితి మద్దతు



కొణతాలను కలిసిన శిష్టకరణ సాధికార సమితి సభ్యులు

కొత్తూరు, మార్చి 23 : జనసేన, తెలుగుదేశం, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణకు రాష్ట్ర శిష్టకరణ సాధికార సమితి నాయకులు అక్కు మహంతి రాజా, జిల్లా కన్వీనర్ జక్కువ వెంకట గోపీనాథరావు పట్నాయక్, తదితరులు మద్దతు తెలిపారు. శనివారం కొణతాలను పార్టీ కార్యాలయంలో కలిసి శిష్టకరణలను బీసీ-డీలో కలిపేందుకు కృషిచేసిన రామకృష్ణను రాబోయే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తామని వారంతా ప్రకటించారు.

మాదక ద్రవ్యాలపై సమగ్ర విచారణ చేపట్టాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

అనకాపల్లి టౌన్, మార్చి 23 : మాదక ద్రవ్యాలపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విశాఖలోని సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్టు సంస్థకు చెందిన రొయ్యల మేత పేరుతో డ్రగ్స్ దిగుమతి అయ్యాయన్నారు. ఈనెల 16న షిప్ విశాఖకు వచ్చినప్పటికీ 21వ తేదీ వరకు అత్యంత రహస్యంగా ఉంచారన్నారు. నిఘా వ్యవస్థ వైఫల్యం కూడా కనిపిస్తుందని విమర్శించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి దోషులు ఎంతటివారైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. యథేచ్ఛగా డ్రగ్స్ విశాఖపట్నంకు వచ్చాయంటే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నాయో అర్థమవుతుందన్నారు.

టెన్త్ పరీక్షా కేంద్రాలను ఏఎస్పీ పరిశీలన

కశింకోట, మార్చి 23: స్థానిక డీపీఎన్ జడ్పీ హైస్కూల్, గర్ల్స్ హైస్కూల్‌లో జరుగుతున్న పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాట్లను జిల్లా అదనపు ఎస్పీ బి.వి జయభాస్కర్ శనివారం పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట సీఐ వినోద్‌బాబు ఉన్నారు.

జగన్ రెడ్డి నియంత పాలన పోవాలి

- టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తల ప్రచారం



కరపత్రాలతో ప్రచారం చేస్తున్న కార్యకర్తలు

కశింకోట, మార్చి 23 : జగన్‌రెడ్డి నియంత పాలన పోయి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు శనివారం ఏనుగుతుని గ్రామంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు గొంతిన చిరంజీవి మాట్లాడుతూ.. కూటమి అభ్యర్థి కొణతాల రామకృష్ణకు గ్లాస్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు అందె సన్యాసిరావు, కర్రి దుర్గనాయుడు, జెర్రిపోతు నూకునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పరవాడ, తానాంల్లో అమ్మవార్ల ఉత్సవాలు

పరవాడ, మార్చి 23: పరవాడ, తానాం గ్రామ దేవతలు పైడిమాంబ, పరదేశిమాంబ జాతరలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. మూడు రోజులుపాటు జరగనున్న ఈ ఉత్సవాలకు భారీ ఏర్పాట్లును ఉత్సవ కమిటీలు చేపట్టాయి. విద్యుత్ దీపాలంకరణలో గ్రామాలు ధగధగలాడుతున్నాయి. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ కేవీ సత్యనారాయణ పర్యవేక్షణలో సీఐ బాలసూర్యారావు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

సీతంపాలెంలో దుర్గాదేవి జాతర

నక్కపల్లి, మార్చి 23: మండలంలోని సీతంపాలెంలో శనివారం దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలను ఊరేగించారు. మధ్యాహ్నం అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. అమ్మవారిని రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైసీపీ మండల అధ్యక్షుడు శీరం నరసింహమూర్తి, జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ దర్శించుకున్నారు. అలాగే డీఎల్‌పురంలో సీతా, రామలక్ష్మణుల విగ్రహాలను గ్రామస్థులు ఊరేగించారు.

‘ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం’

అచ్యుతాపురం రూరల్, మార్చి 23 : కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజా సంక్షేమమే కోరుకుంటుందని కాంగ్రెస్ పార్టీ ఎలమంచిలి సమన్వయకర్త తనకాల అనంతరావు అన్నారు. మండలంలోని వెదురువాడంలో ఇంటింటికీ మహాలక్ష్మి పథకాన్ని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పలువురిని ఇందిరమ్మ అభయం యాప్‌లో నమోదు చేయించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎంవీఆర్ రాహుల్, మండల సోషల్ మీడియా నాయకులు మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన మహిళలు



జనసేన నేత సుందరపు సమక్షంలో పార్టీలో చేరిన మహిళలు

ఎలమంచిలి, మార్చి 23 : మునిసిపాలిటీలోని రామ్‌నగర్ వార్డులో జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుందరపు విజయ్‌కుమార్ సమక్షంలో పెద్ద సంఖ్యలో మహిళలు ఆ పార్టీలో చేరినట్టు కోర్‌కమిటీ ప్రతినిధి పల్లా సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం రాత్రి రామ్‌నగర్ వార్డులో జరిగిన కార్యక్రమంలో మహిళలకు విజయకుమార్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు బొద్దపు శ్రీను, జె.శ్రీను, మాజీ సర్పంచ్ లవుడు లోవరాజు, కొఠారు నరేష్, లాలం సోమునాయుడులు పాల్గొన్నారు.

ఐదుగురు జూదరులపై కేసు

ఎలమంచిలి, మార్చి 23 : మండలంలోని కట్టుపాలెం సమీపంలో శనివారం పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులను పట్టుకున్నట్టు రూరల్ ఎస్ఐ సింహాచలం తెలిపారు. వీరి నుంచి 2,300 రూపాయలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఎన్నికల నిబంధనలు కచ్చితంగా అమలుచేయాలి

- టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెల రాజబాబు

పాయకరావుపేట, మార్చి 23 : ఎన్నికల నిబంధనలను అధికారులు కచ్చితంగా అమలు చేయాలని టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెల రాజబాబు విజ్ఞప్తి చేశారు. శనివారం పాయకరావుపేటలో వైసీపీ నాయకుడు ధనిశెట్టి బాబూరావు ఇంటికి ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వచ్చారని తెలుసుకుని అక్కడకు వచ్చారు. అయితే అప్పటికే అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నా వైసీపీ నాయకుల ఆగడాలు ఆగడం లేదని ఆరోపించారు. ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతో వైసీపీ నాయకులు దొడ్డిదారిన వలంటీర్లకు డబ్బులిచ్చి మభ్యపెట్టే తప్పుడు పనులకు తెరలేపారన్నారు.కార్యక్రమంలో పాండురంగస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ యాళ్ల వరహాలబాబు, నాయకులు మజ్జూరి నారాయణరావు, గొల్లపల్లి నాగు పాల్గొన్నారు.

అనాదిగా ఆచారం..
స్త్రీల వేషధారణలో పురుషులు అలంకారం

» సాగరంలో నేత్రపర్వంగా మోదకొండమ్మ పండగ


మహిళల వేషధారణలో నృత్యాలు చేస్తున్న పురుషులు

మాడుగుల, మార్చి 23 : ఎల్లప్పుడూ తమ గ్రామం పాడిపంటలతో సస్య శ్యామలంగా ఉండాలన్న సంకల్పంతో అక్కడివారు అనాదిగా వస్తున్న ఆచారంలో భాగంగా అమ్మవారికి పూజలు నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా పురుషులే మహిళల వేషధారణతో శనివారం దర్శనమిచ్చారు. మండలంలోని సాగరం పంచాయతీలో మోదకొండమ్మ పండగను అత్యంత ఘనంగా నిర్వహించారు. గ్రామస్థుల మొక్కు ప్రకారం పురుషులు మహిళల వేషధారణలో అలంకరించుకుని అమ్మవారికి పూజలు జరిపారు. అనంతరం మాడుగుల వచ్చి పురవీధుల్లో డప్పువాయిద్యాల నడుమ నృత్యాలు చేశారు. దీంతో ఎవరికి తోచినంతవారు భక్తితో సమర్పించారు. పూర్వకాలం నుంచి వస్తున్న ఆనవాయితీకి అనుగుణంగా తాము ఈ రకంగా వేషధారణ వేసినట్టు వారు తెలిపారు. ఇలా చేయడం వల్ల గ్రామం ఎల్లప్పుడూ సుఖసంతోషాలతో ఉంటుందని వివరించారు.

మండుతున్న ఎండలతో ప్రజలు అవస్థలు


మధ్యాహ్నం పన్నెండు గంటలకు నిర్మానుష్యంగా ఉన్న నాతవరం మెయిన్ రోడ్డు

నాతవరం, మార్చి 23 : ఎండలు రోజు రోజుకు మండుతున్నాయి. గత నాలుగైదు రోజులుగా ఉదయం పది గంటలు దాటితే జనం రోడ్లపైకి రావాలంటేనే ఒకటికి పది సార్లు ఆలోచించాల్సి వస్తుంది. సాయంత్రం నాలుగున్నర గంటల వరకు చాలాచోట్ల రోడ్లు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. దూర ప్రాంతాలకు ప్రయాణాలు సాగించేవారు సైతం తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వేసవి ఆరంభంలోనే ఈ ఏడాది పరిస్థితి ఇలా ఉంటే మున్ముందు ఏమిటని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఇదిలావుంటే, బస్ షెల్టర్, జనసంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో దాతలు చలివేంద్రాలు ఏర్పాటు చేయాల్సిందిగా పలువురు కోరతున్నారు.

'విదేశీ సామ్రాజ్యవాద శక్తులకు వ్యతిరేకంగా పోరు'


భగత్‌సింగ్ వర్ధంతిలో మాట్లాడుతున్న పీడీఎస్‌వో ప్రతినిధి

చోడవరం, మార్చి 23 : విదేశీ సామ్రాజ్యవాద శక్తులకు దేశంలోని వనరులను కట్టబెట్టి, యువతను ఉపాధికి దూరం చేస్తున్న పాలకులకు వ్యతిరేకంగా నేటియువత పోరాటం చేయాలని పీడీఎస్‌వో జిల్లా కన్వీనర్ నందారపు భాస్కర్ పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ వర్ధంతిని శనివారం విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఇక్కడి ఉషోదయ కళాశాలలో నిర్వహించిన సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌వో జిల్లా కో కన్వీనర్ పి.మౌనిక, ఇతర నేతలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సీపట్నం : భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని ఏపీయూడబ్ల్యూజే నర్సీపట్నం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్త జర్నలిస్టుల కోర్కెల దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా శాంతియుత నిరసన తెలిపారు. ఎన్టీఆర్ మినీ స్టేడియంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద జర్నలిస్టుల డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేశారు. సీనియర్ నాయకులు సీహెచ్‌బీఎల్ స్వామి, జర్నలిస్టు చుక్కల రాము, ఉపాధ్యక్షుడు మడ్డు రామకృష్ణ, జాయింట్ సెక్రటరీ పసుపులేటి ప్రభాకర్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు రామకృష్ణ, రాము, అప్పారావు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : భగత్‌సింగ్ త్యాగం చిరస్మరణీయమని సామాజిక కార్యకర్త ఆకుల నాగేశ్వరరావు కీర్తించారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా శనివారం ఆయన చిత్రపటానికి వడ్డాదిలో పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కోవెల ఈశ్వరరావు, యల్లపు విజయ్‌కుమార్, గుడాల ఆనంద్, పెదిరెడ్ల మాణిక్యం, గుద్దేటి శ్రీను, చందు తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని జర్నలిస్టులు కోర్కెల దినోత్సవంగా శనివారం ఇక్కడ నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల ప్రధాన సమస్యలను ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చాలని చోడవరం ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి నేమాల సతీష్ పార్టీల నాయకులను కోరారు. ఏపీయూడబ్ల్యూజే అనకాపల్లి జిల్లా కార్యవర్గ సభ్యుడు కుబిరెడ్డి రాధాకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

మాడుగుల : జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోరుతూ ఇక్కడి తహసీల్దార్ టి.సత్యనారాయణకు శనివారం వినతిపత్రం అందజేశారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే ఆదేశాల మేరకు మాడుగుల ప్రెస్‌క్లబ్ సభ్యులు సమస్యలతో కూడిన వినతిని తహసీల్దార్‌కి అందించారు. మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, మీడియా సంస్థలు, జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక చట్టం చేయాలని, 50ఏళ్ల వయస్సు ఉన్న జర్నలిస్టులకు కనీసం రూ.5వేలు పింఛన్ ఇవ్వాలని కోరారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు రొబ్బా శ్రీను, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గ్రావెల్ దోపిడీకి అడ్డేది?


కొత్తూరు సమీపంలో నిల్వ చేసిన గ్రావెల్

... 5వ పేజీ తరువాయి

డిమాండ్‌ను బట్టి గ్రావెల్ తవ్వి నేరుగా తరలించుకుపోయి సొమ్ము చేసుకుంటుండగా, మరికొందరు వెదుళ్లనరవ, కొత్తూరు, దువ్వాడ సమీపంలో సంధ్యానగర్ తదితర ప్రాంతాల్లో నిల్వ చేస్తున్నారు. కొన్ని నెలలుగా ఈ వ్యవహారం జరుగుతున్నా రెవెన్యూ, మైనింగ్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదులు చేసిన వారి సమాచారాన్ని అక్రమార్కులకు అధికారులు ఇస్తున్నారని వాపోతున్నారు. తవ్వకాలను అడ్డుకునే ప్రయత్నం చేస్తే దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంగవరానికి చెందిన అధికార పార్టీ నేతలు, అక్కడి వలంటీర్‌కు ఇందులో ప్రమేయం ఉందనే ప్రచారం జరుగుతోంది. గత తహసీల్దార్ వీరిపై ఫిర్యాదు చేసినా అప్పటి సీఐ కనీసం కేసు కూడా నమోదు చేయలేదని తెలిసింది. జగనన్న లేఅవుట్‌లో బేస్‌మెంట్ ఫిల్లింగ్‌కు అనుమతి పొందిన అక్రమార్కులు.. లేఅవుట్ సూపర్‌వైజర్లు, సిబ్బందితో కుమ్మక్కై గ్రావెల్ దోపిడీకి పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంధ్యానగర్ కాలనీ ఆర్చి వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసి అక్రమార్కుల ఆగడాలను అరికట్టాలని కోరుతున్నారు.

నిత్యం ఇదే తంతు.. ఇబ్బందులు ప్రజల వంతు

» నర్సీపట్నం పాత బస్టాండ్‌లో ఎప్పటికప్పుడు ట్రాఫిక్ జామ్ » వ్యాన్‌లు, లారీలు రోడ్డుపై ఆపి సరకులు లోడింగ్, అన్‌లోడింగ్ » అవస్థలు పడుతున్న వాహనదారులు » కనీసం పట్టించుకోని పోలీసులు


రోడ్డుపై వ్యాన్ నిలిపి సరకులు దించుతున్న దృశ్యం


ట్రాఫిక్ స్తంభించి పోవడంతో నిలిచి పోయిన వాహనాలు

నర్సీపట్నం, మార్చి 23 : పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో నిత్యం ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. నిత్యం ఇక్కడ రద్దీగా ఉంటుంది. శనివారం తుని రోడ్డు, పాత బస్టాండ్, ఐదు రోడ్ల కూడలివైపు వెళ్లే బైక్‌లు, కార్లు ట్రాఫిక్ వలయంలో చిక్కుకొని నిలిచిపోయాయి. తుని, కృష్ణాదేవిపేట వెళ్లే ఆర్టీసీ బస్సులు పాత బస్టాండ్‌లో ఆగి ప్రయాణికులను ఎక్కించుకొని బయల్దేరుతుంటాయి. వేములపూడి, తాండవ, ఎ.శరభవరం తదితర గ్రామాలకు సంబంధించిన ఆటో స్టాండ్ ఇక్కడే ఉంది. వందల సంఖ్యలో ఆటోలు, బైక్‌లు రాకపోకలు సాగిస్తుంటాయి. తుని రోడ్డులో ఉల్లిపాయలు, ప్లంబింగ్, కిరాణా హోల్ సేల్ వ్యాపారులు ఉన్నారు. హోల్ సేల్ వ్యాపారులకు సంబంధించిన వ్యాన్‌లు, ఆటోలు మెయిన్ రోడ్డులో ఉంచి సరకులను లోడింగ్ అన్‌లోడింగ్ చేస్తున్నారు. దీంతో పాత బస్టాండ్, ఐదు రోడ్ల కూడలి, తునికి వెళ్లే బస్సులు, ఆటోలు, బైక్‌లు గంటల తరబడిట్రాఫిక్‌లో చిక్కుంటున్నాయి. పాత బస్టాండ్‌లో అసలే ఇరుకు రోడ్డు ఆపై వాహనాలను మెయిన్ రోడ్డులో దుకాణాల ముందు నిలపడం వలన ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించిపో తోంది. కొందరు డ్రైవర్లు ఆటోలను ఇష్టానుసారంగా నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. నిత్యం ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది పడుతున్నా పోలీసులు కనీసం పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఈ సమస్యపై తక్షణమే ఉన్నతాధికారులు స్పందించాల్సిందిగా కోరుతున్నారు.

వడ్డాది వెంకన్న ఆలయంలో భక్తుల సందడి

» కల్యాణోత్సవాల్లో భాగంగా భారీగా తరలి రాక
» నేడు నాగవల్లి వసంతోత్సవం » 80మంది పోలీసులతో బందోబస్తు


భక్తుల పూజలందుకుంటున్న స్వామి


స్వామి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

బుచ్చెయ్యపేట, మార్చి 23 : వడ్డాదిలోని గిరిజాంబ గిరిపై కొలువుదీరిన స్వయంభూ శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా వేకువ జాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఇదిలావుంటే, వార్షిక కల్యాణోత్సవాల్లో కీలక ఘట్టమైన స్వామివారి వసంతోత్సవం ఆదివారం జరగనుంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశామని దేవదాయశాఖ ఈవో శర్మ తెలిపారు. ఈ వేడుకకు భారీ సంఖ్యలో భక్తులు తరలి రానుండడంతో అం దుకు అనుగుణంగా ఏర్పాట్లు చేపట్టినట్టు చెప్పారు. గిరిజాంబగిరి నుంచి స్థానిక శారదా నదిలో చక్రస్నానం వరకు గ్రామం అంతా ఆనందోత్సాహాలతో రంగులు జల్లుకుంటారు. చిన్నాపెద్ద అన్న తేడా లేకుండా అంతా ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా 80 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని కొత్తకోట సీఐ అప్పల నాయుడు తెలిపారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించామని వివరించారు.


ఆలయం వద్ద పందిరికి భక్తులు మొక్కుబడిగా కట్టిన కాయలు, పండ్లు

గొల్లలపాలెంలో పోతురాజు గావు పండగ

కె.కోటపాడు, మార్చి 23 : కింతాడ శివారు గొల్లలపాలెంలో పోతురాజు స్వామిగావు పండగను శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇందులో భాగంగా గుడి వద్ద పందిరి వేశారు. వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన భక్తులు మొక్కుబడులుగా అరటి గెలలు, బెల్లం దిమ్మలు, గుమ్మడి కాయలు, చీరలు, నగదు, కొబ్బరి గెలలను ఆ పందిరికి వేలాడదీశారు. తప్పెటగుళ్ల కళాకారుల ప్రదర్శనుల ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటైంది. అనంతరం పందిరి దోపిడీని ఆలయ సాంప్రదాయం ప్రకారం జరిపారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడుతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి 30 కుటుంబాలు టీడీపీలో చేరిక


టీడీలో చేరిన వారితో చింతకాయల విజయ్, పద్మావతి

మాకవరపాలెం, మార్చి 23 : మండలంలోని రాచపల్లి పంచాయతీ శివారు కొత్తపాలేనికి చెందిన 30 కుటుంబాలవారు వైసీపీ నుంచి శనివారం టీడీపీలో చేరారు. తొలుత వీరు నర్సీపట్నంలోని మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ఇంటికి వెళ్లారు. అక్కడ వీరికి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, అయ్యన్న సతీమణి, మునిసిపల్ కౌన్సిలర్ పద్మావతి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన మాకిరెడ్డి నూకరాజు, శాంతి, ఎర్రినాయుడు, పోలిరెడ్డి గంగబాబు, రొంగల లక్ష్మి తదితరులు మాట్లాడుతూ పునరావాస కాలనీ సమస్యలపై అధికార పార్టీ నిర్లక్ష్యం వహించడంతో తాము ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. రాచపల్లి మాజీ సర్పంచ్ రుత్తల జోగిపాత్రుడు, శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు, భీమబోయినపాలెం సర్పంచ్ రుత్తల నంధకిశోర్, టీడీపీ మండల యూత్ ఉపాధ్యక్షుడు గిరిబాబు, రుత్తల జమిందార్, అడిగర్ల శ్రీనువాసరావు తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ : రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనను అంతమొందించేందుకు ఓటర్లంతా సిద్ధం కావాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ పిలుపునిచ్చారు. కొమిర, రావణాపల్లి గ్రామాల్లో శనివారం రాత్రి నిర్వహించిన ఎన్నికల శంఖారావం సభలో మాట్లాడారు. టీడీపీతోనే రాష్ట్రానికి భవిష్యత్తు అన్నారు. ఈ ఎన్నికల్లో అయ్యన్నపాత్రుడ్ని అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిందిగా కోరారు. టీడీపీ, జనసేన నాయకులు అడిగర్ల అప్పలనాయుడు, రాజాన వీరసూర్యచంద్ర, కొల్లి రాంబాబు, కె.రవివర్మ, కర్రి నాయుడు, సుర్ల బాబ్జి, కొల్లి సత్యనారాయణ, ఆదపురెడ్డి గోపి తదితరులు పాల్గొన్నారు.

'తనిఖీల్లో ఏ ఒక్క వాహనానికి మినహాయింపు వద్దు'


అప్పలరాజుపురంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

చీడికాడ, మార్చి 23 : చెక్‌పోస్టు వద్ద తనిఖీలు పక్కాగా నిర్వహించాలని, ఏ ఒక్క వాహనానికి మినహా యింపు ఇవ్వరాదని ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి పోలీసు సిబ్బందిని ఆదేశించారు. కోనాం చెక్‌పోస్టును ఎస్‌ఐ జి.నారాయణరావుతో కలిసి శనివారం మధ్యాహ్నం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలు ముగిసే వరకూ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఏ రాజకీయ పార్టీ నాయకులైనా తనిఖీల్లో మినహాయింపు ఇవ్వవద్దని స్పష్టం చేశారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ ఉమా వాణిశ్రీతో కలిసి శిరిజాం, ఖండివరం, అప్పల రాజుపురం సచివాలయాలను తనిఖీచేశారు. సచివాలయ కార్యదర్శులు ఎం.పద్మావతి, ఎం.వీర్రాజు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో గాయపడిన విద్యార్థి ప్రసాద్

కె.కోటపాడు, మార్చి 23 : మండల కేంద్రం కె.కోటపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఓపెన్ ఇంటర్ పరీక్ష రాసేందుకు వస్తున్న విద్యార్థి తీవ్ర గాయాలకు గురయ్యాడు. రోలుగుంట మండలం సర్వవరం గ్రామానికి చెందిన బొబ్బిలి ప్రసాద్ బైక్‌పై పరీక్షకు వస్తుండగా, చౌడువాడ చేరేసరికి వెంకన్నపాలెం నుంచి వెళ్తున్న ఆర్టీసీ బస్సు తగిలి కింద పడిపోయాడు. దీంతో తీవ్ర గాయాలు కావడంతో ఇక్కడి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకు వెళ్లగా ప్రాథమిక చికిత్సల నంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.

మద్యం, నగదు తరలించకుండా అప్రమత్తంగా ఉండాలి

» చెక్ పోస్టు వద్ద పోలీసు సిబ్బందికి ఎంపీడీవో రాంబాబు సూచన


చెక్‌పోస్టు వద్ద సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎంపీడీవో

నాతవరం, మార్చి 23 : ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో మద్యం, నగదు వంటివి తరలించకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో జె.రాంబాబు సూచించారు. తుని-నర్సీపట్నం రూట్‌లోని గన్నవరంమెట్ట వద్ద ఏర్పాటు చేసిన పోలీసు చెక్‌పోస్టును శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ విధులు నిర్వహించే పోలీసు సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఇప్పటివరకు గన్నవరం మెట్టవద్ద లక్షా 38 రూపాయలను సాధీనం చేసుకున్నామని, వాటికి ఆధారాలు చూపడంతో తిరిగి సంబంధిత వ్యక్తులకు ఇచ్చివేసినట్టు సిబ్బంది తెలిపారు. అనంతరం ఎంబీపట్నం, శృంగవరం గ్రామాలలో పర్యటించారు. ఇంకా కొన్ని శిలఫలకాలను మూసివేయకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

మోడల్ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలు

చీడికాడ, మార్చి 23 : మంచాల మోడల్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ చెరకాపు వెంకటలక్ష్మి తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సులు కళాశాలలో ఉన్నట్టు చెప్పారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు, ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందిన పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు అర్హులుగా పేర్కొన్నారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 ఫీజు చెల్లించి మే 22వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆమె కోరారు.

'80 ఏళ్లు దాటిన వారికి పోస్టల్ బ్యాలెట్ '

రోలుగుంట, మార్చి 23 : కేంద్ర ఎన్నికల కమిషన్ ఎనభై సంవత్సరాలు దాటిన వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించిందని తహసీల్దార్ రవిచంద్ర తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివిధ కారణాల వల్ల 80 ఏళ్లు దాటిన వారిలో నలభై నుంచి యాభై శాతంమంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకుంటున్నట్టు ఎన్నికల కమిషన్ గుర్తించిందన్నారు. అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలనే ఉద్దేశ్యంలో భాగంగా వారికి పోస్టల్ బ్యాలెట్ ఆప్షన్ ఇచ్చినట్టు వివరించారు. మండలంలోని అర్హులైన వృద్ధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

ప్రశాంత ఎన్నికలకు పోలీసు బలగాలు కవాతు



దేవరాపల్లిలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర పోలీసు బలగాలు

దేవరాపల్లి, మార్చి 23 : సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలంతా సహకరించాలని కోరుతూ కేంద్ర బలగాలతో కలిసి స్థానిక పోలీసులు శనివారం పలు గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఎస్‌ఐ డి.నాగేంద్ర ఆధ్వర్యంలో వీరంతా దేవరాపల్లి, వాకపల్లి, బేతపూడి, కాశీపురం ,నాగయ్యపేట, వెంకటరాజపురం తదితర గ్రామాలకు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ నిబంధనలను పాటించాలన్నారు. కోడ్ అతిక్రమించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో పాడి గేదెకు గాయాలు

బుచ్చెయ్యపేట, మార్చి 23 : కశింకోట-బంగారుమెట్ట రోడ్డులో శనివారం జరిగిన వ్యాన్ ప్రమాదంలో పాడిగేదెకు తీవ్ర గాయాలయ్యాయి. బాధిత రైతు పెదమదీనాకు చెందిన వియ్యపు గోవింద తెలిపిన వివరాలివి. రాజాంలో పాడి గేదెను కొనుగోలు చేసి, దిబ్బిడిలో ఉన్న బంధువుకు అప్పగించేందుకు వ్యాన్‌లో తీసుకు వెళుతుండగా, బంగారుమెట్ట కూడలి సమీపంలో గల చెట్టుకు వ్యాన్‌ను ఢీకొనడంతో ఈ ఘటన జరిగిందన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల పండగ


రాచపల్లిలో భక్తుల పూజలందుకున్న గౌరీపరమేశ్వర్లు

మాకవరపాలెం, మార్చి 23 : మండలంలోని రాచపల్లి గ్రామంలో గౌరీపరమేశ్వరుల పండగను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి ఆది దంపతుల దర్శనానికి భక్తులు పోటెత్తారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నసమారాధన జరిపారు. సాయంత్రం మేళతాళాలు, బాజాభజంత్రీల నడుమ పురవీధుల్లో స్వామి, అమ్మ వారి విగ్రహాన్ని ఊరేగించారు. ఈ వేడుకల్లో సర్పంచ్ రుత్తల సీతారాముడు, ఎంపీటీసీ సభ్యుడు ఆర్.వై.పాత్రుడుతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ



బుచ్చెంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రోలుగుంట, మార్చి 23 : క్షయ వ్యాధి నివారణపై అంతా అవగాహన కలిగి ఉండాలని బుచ్చెంపేట ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ సునీత అన్నారు. క్షయ వ్యాధి నివారణపై గ్రామంలో శనివారం ఏర్పాటైన అవగాహన ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. వ్యాధి సోకినవారు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. మూడు వారాలు దగ్గు ఉన్నా, రక్తంతో కఫం వచ్చినా, బరువు తగ్గుతున్నా సమీప ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

'మాడుగుల టీడీపీ అభ్యర్థిపై పునరాలోచన చేయాలి'




దేవరాపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు

దేవరాపల్లి, మార్చి 23 : మాడుగుల నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిపై అధినేత చంద్రబాబునాయుడు పునరాలోచన చేయాలి పలువురు పార్టీ శ్రేణులు కోరారు. ఈ మేరకు దేవరాపల్లిలో శనివారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. టిక్కెట్టును మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడికి లేదా నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్‌కు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు సోమిరెడ్డి గోవింద, పూడి సత్యారావు, రామలింగస్వామి, గంధం జగన్, సింహ తదితరులు పాల్గొన్నారు.

'సంధ్య' యజమానుల్ని కఠినంగా శిక్షించాలి

» మాజీ మంత్రి దాడి వీరభద్రరావు



అనకాపల్లి టౌన్, మార్చి 23 : సంధ్య ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ యజమానుల్ని కఠినంగా శిక్షించాలని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మానవత్వం లేని ఈ మృగాలను, వారికి దన్నుగా నిలుస్తున్న రాజకీయ నాయకులను న్యాయస్థానాలు తమ విస్తృత అధికారాలను ఉపయోగించి శిక్షించాలని కోరారు. సుమారు లక్ష కోట్ల రూపాయల విలువైన భయంకరమైన మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్న సీబీఐ అధికారులను ఆయన అభినందిస్తున్నానన్నారు. దూర ప్రాంత జిల్లాల నుంచి వచ్చిన నేరస్థులు విశాఖపట్టణాన్ని నేరాల అడ్డాగా తయారు చేస్తున్నారన్నారు. సీబీఐ వారు నేర పరిశోధన జాగిలాలను పంపమని కోరినపుడు విశాఖ పోలీస్ కమిషనర్ ఎందుకు వెళ్లారో, సీబీఐ విచారణలో చొరబడడానికి ఎందుకు ప్రయత్నించారో ప్రశ్నార్థకంగా ఉందన్నారు. ఆక్వా కంపెనీ వారు స్వయంగా అక్కడికి హాజరై కంటైయినర్‌ను తెరవకుండా అడ్డుకున్నారంటే.. వారి వెనుక బలమైన రాజకీయ, పోలీస్ యంత్రాంగాలు ఉన్నట్టు అర్థమవుతోందన్నారు. దేశంలోని అనేక రాష్ట్రాలకు విశాఖ నుంచి వెళ్లిన మత్తు పదార్థాలే సమాజాన్ని నాశనం చేస్తున్నాయంటే విశాఖలో కట్టుదిట్టమైన పరిపాలనా వ్యవస్థ లేనట్టుగా రుజువవుతోందన్నారు. ఈ లక్ష కోట్ల రూపాయల విలువైన మత్తు పదార్థాలు ఎన్నికల్లో అమాయకులైన యువకులకు పంచి ఇచ్చేందుకే అన్న అపోహలు ఉన్నందున ఎన్నికల కమిషన్ కూడా చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశానని తెలిపారు.